# సాక్షి
## వైఎస్సార్ జిల్లా

గురువారం । 2 । మార్చి । 2023






### లింగ వివక్ష చూపితే క్రిమినల్ కేసు

లింగ వివక్ష చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. -8లో..



### బైక్ అదుపు తప్పి ఇద్దరు మృతి

మైదుకూరు - ప్రొద్దుటూరు రహదారిపై బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఇద్దరు దుర్మరణం చెందారు. -8లో..

### వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.1/20.1

జిల్లాలో బుధవారం 20.1 - 35.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### నేడు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరం విద్యుత్ భవన్‌లోని క్రీడామైదానంలో గురువారం ఉదయం జిల్లా స్థాయి ఫుట్‌బాల్ మహిళల విభాగం ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మహబూబ్ హుస్సేన్ తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారిణులు వారి పుట్టినతేదీ ధృవీకరణపత్రం, ఆధార్ జిరాక్స్ ప్రతులు, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు.

### ప్రాక్టికల్ పరీక్షలకు 4254 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా 4వ రోజు బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 4254 మంది హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో 64 పరీక్షా కేంద్రాలకుగాను 4382 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయవలసి ఉండగా 128 మంది గైర్హాజరుకావడంతో 4254 మంది హాజరయ్యారు. జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు పరిశీలకుడు రమణగుప్తా, ఆర్‌ఐవో రమణరాజు, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డిలు తనిఖీ చేశారు.

### ఎన్నికల నిర్వహణపై శిక్షణ

కడప సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలని కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఎన్నికలకు సంబంధించి పీఓ, ఏపీఓ, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, బద్వేలు ఆర్డీఓ వెంకట రమణ, సమగ్ర శిక్ష పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈనెల 13వ తేదిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను దృష్టిలో పెట్టుకుని వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా 38 పోలింగ్ పోలింగ్ కేంద్రాలు ఉపాధ్యాయ ఎన్నికలకు, అలాగే 93 పట్టభద్రుల పోలింగ్ స్టేషన్లతో కలిపి మొత్తం 131 కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10వ తేదీన రెండవ విడత శిక్షణా కార్యక్రమం ఉంటుందని, ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరియల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

### ప్రారంభమైన ఇంటర్వ్యూలు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గెస్ట్ ఫ్యాకల్టీకి సంబంధించి ఇంటర్వ్యూలు ప్రారంభమైనట్లు డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. బుధవారం స్థానిక ట్రిపుల్ ఐటీలోని అతిథి భవనంలో వివిధ సబ్జెక్టుల గెస్ట్ ఫ్యాకల్టీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు 28 మంది అభ్యర్థులు హాజరు కాగా.. అందులో మ్యాథ్స్, తెలుగు సబ్జెక్టులకు 11మంది చొప్పున, ఇంగ్లీషు నలుగురు, బయాలజీకి ఇద్దరు చొప్పున హాజరయ్యారన్నారు. గురు, శుక్రవారాలు కూడా ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఓ జిలాని, అకడమిక్ డీన్ రత్నకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే ప్రారంభం



కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే బుధవారం ప్రారంభమైంది. ఈ సర్వే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు తనిఖీ చేశారు. నాగరాజుపేట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగరాజుపేట-2 సచివాలయాన్ని సందర్శించి అక్కడ ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలకు ఎవరికైనా స్పర్శలేని మచ్చలు, చర్మంపై రాగిరంగు మచ్చలు, పొడలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, కాలు లేదా చేతుల కండరాలలో బలహీనంగా ఉండే చేతులు తదితర లక్షణాలు ఎవరికైనా ఉంటే సమీపంలో ఉన్న ఆశాను లేదా ఏఎన్ఎంలను సంప్రదించాలన్నారు. అలాగే సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుని వద్ద పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ కుష్టు వ్యాధని నిర్ధారణ అయితే వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నెలలు లేదా 12 నెలలు ఎండీటీ మందులు వాడాలన్నారు. ఈ మందులను ఉచితంగా పొందవచ్చన్నారు. డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ఈ సర్వే కార్యక్రమం ఈనెల 21వ తేది వరకు జరుగుతుందన్నారు. సర్వేలో భాగంగా అనుమానితులను గుర్తించి వెంటనే పట్టణ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యుని వద్ద పరీక్షలు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బషీర్ అహ్మద్, పారా మెడికల్ అధికారి ఎ.నాగన్న, ఫిజియోథెరఫిస్టు విక్టర్, మనోహర్, సూపర్‌వైజర్ రామాంజనమ్మ, ఆశాలు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఆధారే ఆధారం

AADHAAR

- ఆధార్ అనుసంధానం లేకపోతే డబ్బు రాదు
- కొత్త విధానాన్ని అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో ఉపాధిలో ఇప్పటికే 99.65 శాతం ఆధార్ నమోదు
- మిగిలిన శాతం పూర్తికి ఉపాధి సిబ్బంది చర్యలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కడప సిటీ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగం కాకుండా పలు మార్పులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. తొలుత సాధారణ మస్టర్ విధానంతో ఉపాధి కూలీలకు డబ్బులు జమ చేస్తుండగా, ఆ తర్వాత పనుల జియోట్యాగ్ ద్వారా కూలీల సంఖ్యను కనుగొనే విధంగా ఫొటోలను అప్‌లోడ్ చేస్తేనే కూలీలకు డబ్బులు కేంద్ర ప్రభుత్వం చెల్లించేది. ఆ తర్వాత ఆన్‌లైన్ అటెండెన్స్‌ను తీసుకొచ్చారు. కొత్తగా ఇటీవల కూలీల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసింది.

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఆధార్ ఆధారిత చెల్లింపు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇకపై ఆధార్ అనుసంధానించిన బ్యాంకు ఖాతాలకే సంబంధిత కూలీ డబ్బులను జమ చేయనున్నారు.

**అక్రమాలకు తావు లేకుండా..**

ఆధార్ నంబర్ బ్యాంకు ఖాతాకు అనుసంధానంతో పనికి వెళ్లిన కూలీలకు మాత్రమే డబ్బులు జమ అయ్యే పరిస్థితి ఉంటుంది. పనికి రాకుండా మోసం చేసే పరిస్థితికి దీంతో చెక్ పడనుంది. ఉపాధి కూలీల్లో కొందరి పేర్లతో పలు బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నట్లు కూడా ప్రభుత్వం దృష్టికి పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాలకు వివిధ బ్యాంకుల్లో ఖాతాలతోపాటు ఉపాధికి మరో బ్యాంకులో ఖాతాలు ఉండడం వల్ల మోసాలు జరిగే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇప్పటికే ఆధార్ అనుసంధానించిన ఖాతాను ఉపాధి హామీ పనుల్లో మ్యాపింగ్ చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో ఆధార్ అనుసంధానం ఊపందుకుంది.

**99.65 శాతం ఆధార్ లింక్**





జిల్లాలో మొత్తం ఉపాధి హామీలో పనులకు వెళ్లే వారి జాబ్‌కార్డులు 2,49,319 కుటుంబాలకు ఉన్నాయి. ఇందులో 4,69,548 మంది కూలీలు ఉన్నారు. ఇందులో ఆధార్ బ్యాంకు ఖాతాకు లింక్ అయిన కూలీలు 4,48,283 అంటే 95.47 శాతంగా ఉంది. ఇంకా 21,265 (4.63 శాతం) బ్యాంకు ఖాతాకు కూలీల ఖాతాలను ఆధార్‌కు లింక్ చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం యాక్టివ్‌లో ఉన్న జాబ్‌కార్డులు 2,00,291 ఉండగా, ఇందులో కూలీలు 3,45,420 మంది ఉన్నారు. ఇందులో 3,44,248 (99.65 శాతం) మంది కూలీలకు ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు లింక్ చేశారు. ఇంకా కేవలం 1192 (0.35 శాతం) మంది కూలీలకు మాత్రమే ఆధార్ లింక్ చేయాల్సి ఉంది.

**వంద శాతం ఆధార్ లింక్‌కు చర్యలు**



జిల్లాలో ఉన్న ఉపాధి హామీ పనులకు వచ్చేవేతన జీవులకు బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయడం మంచి నిర్ణయమే. ఎక్కడా పొరపాట్లు, మోసాలకు తావు లేకుండా పనికి వచ్చే నిజమైన కూలీలకు న్యాయం జరుగుతుంది. ఇప్పటికే 99.65 శాతం ఆధార్‌లింక్ చేశాం. మిగిలిన శాతాన్ని కూడా త్వరలోనే పూర్తి చేసి జిల్లాను అగ్రగామిగా నిలుపుతాం.

– యదుభూషణరెడ్డి, డ్వామా పీడీ, కడప



ఉపాధి పనులు జరుగుతున్న గ్రామాలు: 563

పనులు జరుగుతున్న ప్రాంతాలు: 1932

రోజుకు హాజరవుతున్న కూలీలు: 30,000

మొత్తం జాబ్ కార్డులు ఉన్న కుటుంబాలు 2,49,319

అందులోని కూలీలు: 4,48,283

## పండుటాకుల పరవశం

- జిల్లాలో 2,54,985 మందికి పెన్షన్లు
- వలంటీర్ల ద్వారా మొత్తం రూ.70.38 కోట్లకు పైగా పంపిణీకి చర్యలు

కడప రూరల్ : ఒకటో తేది వచ్చింది...పింఛన్ పండుగను తంచనుగా తెచ్చింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక కింద పింఛన్ పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. తెల్లవారకముందే ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు అర్హులైన వారి ఇళ్లకు వెళ్లారు. అవ్వాతాతలను పలకరించారు. కుశల ప్రశ్నలు వేశారు. అనంతరం పింఛన్ నగదును అందజేశారు. మొత్తం 2,54,985 మంది పింఛన్లకుగాను మొత్తం రూ. 70,38,09,750 నగదును పంపిణీ చేయాల్సి ఉంది. సాయంత్రం 5.00 గంటల ప్రాంతానికి 2,00,419 పింఛన్లకుగాను రూ. 56,33,69,500 పంపిణీ చేశారు. దీంతో పింఛన్ల పంపిణీ ప్రక్రియ మొదటిరోజే 78.62 శాతం నమోదైంది. వలంటీర్లు ఇంటివద్దకే వచ్చి పింఛన్ నగదును అందజేయడం పట్ల అవ్వాతాతలు ఆనందంతో పరవశించిపోయారు.

**ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటా**



ఈ ఫొటోలో కుర్చీలో కూర్చొన్న వ్యక్తి పేరు ఎం.నిత్యపూజయ్య. మైదుకూరు ప్రాంతంలోని వినాయకనగర్‌కు చెందిన వారు. ఆ ప్రాంత వలంటీర్ భాస్కర్ ఉదయాన్నే వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. దీంతో నిత్యపూజయ్య సంతోషం వ్యక్తం చేశారు. మాలాంటి నడవలేని వారికి, వృద్ధులకు ఈ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోందని అన్నారు. ఇంటి వద్దకే వచ్చి పింఛన్ నగదును అందజేయడం మాలాంటి వారికి ఎంతో ఊరటగా ఉందన్నారు. ఈ ప్రభుత్వానికి తామంతా రుణపడి ఉంటామని తెలిపారు.

## మండలి ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

కడప సిటీ : శాసన మండలి ఎన్నికలను పగడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలను చేపడుతున్నామని కలెక్టర్ విజయ రామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలియజేశారు. బుధవారం శాసనమండలి ఎన్నికల నిర్వహణపై అమరావతి నుండి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆయా జిల్లాల కలెక్టర్లు, జేసీలు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్, జేసీ, ఏఎస్పీ డీఆర్‌ఓలు హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల నిర్వహణ అధికారులు, సూపరింటెండెంట్ శివారెడ్డి పాల్గొన్నారు.

**సంక్షేమ హాస్టళ్లను బాధ్యతతో నిర్వహించాలి**

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ విజయరామరాజు సంక్షేమశాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంక్షేమ వసతి గృహాల్లో వసతులు, సదుపాయాలపై కలెక్టర్ ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాశ్, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, మైనార్టీ కార్పొరేషన్, బీసీ సంక్షేమశాఖ అధికారి బ్రహ్మయ్య, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, వికలాంగులు, మైనార్టీ సంక్షేమశాఖల అధికారి కృష్ణ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

**మాతా శిశు మరణాల నివారణకు కృషి**

మాతా శిశు మరణాల నివారణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ విజయరామరాజు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలు, లింగ నిష్పత్తి, ఫ్యామిలీ డాక్టర్ పథకం అమలు తదితర అంశాలపై వైద్యులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వర్, అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, వైద్యాధికారులు, పీహెచ్‌సీ, అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ విజయరామరాజు, జేసీ తదితరులు

**జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు భాగస్వాములు కావాలి**

ప్రభుత్వ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా సేవలు అందిస్తూ జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో కలెక్టర్ విజయరామరాజు అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవల్ రివ్యూ కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్ , నాబార్డు డీడీఎం విజయ్‌విహారి, ఆర్బీఐ మేనేజర్ అనిల్, కెనరా బ్యాంకు ఆర్ఎం మురళీమోహన్, ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి, యూనియన్ బ్యాంకు ఆర్ఎం భాస్కర్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన పుష్పగిరి ప్రదక్షిణ

వల్లూరు: ప్రఖ్యాతి గాంచిన పుష్పగిరి పుణ్యక్షేత్రంలో బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. పుష్పగిరి కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ సమీపంలో పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి, కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డిల సమక్షంలో గిరి ప్రదక్షిణకు గానూ వేద పండితులు ముందుగా శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలు కొబ్బరి కాయలను కొట్టి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో కలిసి కొంత దూరం నడక సాగించారు. మార్గ మధ్యలో ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి, కార్పొరేటర్ పాకా సురేష్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.



పుష్పగిరి ప్రదక్షిణలో భక్తులతో కలిసి నడుస్తున్న పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతీ స్వామి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**పుష్పగిరి ప్రదక్షిణ సకల దేవతా ప్రదక్షిణ ఫలాన్ని ఇస్తుంది**

రామాయణం గ్రంథాల దగ్గర నుండి మనకు పుష్పగిరి క్షేత్ర విశిష్టత కనిపిస్తుంది. ఎంతో మంది భారత దేశ సంప్రదాయంలో గురువులుగా వున్నవారు దర్శించి దైవతా తత్వాన్ని, గురు తత్వాన్ని స్థాపించిన దివ్య క్షేత్రం పుష్పగిరి. ఇలా చెప్పుకుంటూ పోతే పుష్పగిరి క్షేత్రం ఎంతో విశిష్టమైనది. దేవ గిరి పుష్పగిరి, అరుణ గిరి పుష్పగిరి. ఇది భాస్కర క్షేత్రం. ఈ పుష్పగిరిని ప్రదక్షిణ చేస్తే సకల దేవతా ప్రదక్షిణ చేసిన ఫలాన్ని పొందుతామని పుష్పాచల ఖండంలో కూడా వుంది. పుష్పగిరి పరిక్రమణ అనేది కొత్తగా చేస్తున్నది కాదు. ఇక్కడ వున్నదాన్ని తిరిగి అమలులోకి తీసుకుని అభ్యాసంలో పెట్టడానికి ముహూర్తం నిర్ణయించాము.

– శ్రీ విద్యా శంకర భారతీ స్వామి, పుష్పగిరి పీఠాధిపతి

**పుష్పగిరి ప్రదక్షిణ శుభప్రదం**

గతంలో ఈ క్షేత్రంలో జరుగుతూ కాల క్రమంలో నిలిచి పోయిన గిరి ప్రదక్షిణను తిరిగి ప్రారంభించడం శుభ దాయకం. ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించడం చాలా సంతోషకరం. గిరి ప్రదక్షిణ ఎంతో పుణ్య కార్యం. దీని వలన ఈ ప్రాంతంతో బాటుగా ప్రజలకు , ప్రదక్షిణ చేసే భక్తులకు ఎంతో మేలు జరుగుతుంది. గిరి ప్రదక్షిణకు పేరు గాంచిన అరుణాచల క్షేత్రం మాదిరిగానే పవిత్రమైన క్షేత్రం పుష్పగిరి. ఈ క్షేత్రంలో గిరి ప్రదక్షిణ ప్రారంభించడం శుభ దాయకం.

– పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే , కమలాపురం

## ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయరెడ్డి**



మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

కడప కార్పొరేషన్ : ఎమ్మెల్సీ ఎన్నికలను జేసీఎస్ మండల ఇన్‌ఛార్జిలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం శిల్పారామం కన్వెన్షన్ హాలులో ఉమ్మడి వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల (జేసీఎస్) మండల ఇన్‌ఛార్జిలతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13వ తేదీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లను మనవైపు తిప్పుకోవడానికి కసరత్తు చేయాలన్నారు. జేసీఎస్ ఇన్‌ఛార్జిలు కీలకంగా పనిచేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 34,108 ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వగా, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2.6 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలు కలుపుకుని 6.16 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం సౌకర్యాల కల్పన కోసమే డీబీటీ ద్వారా నగదు ఖాతాలకు జమ చేయడం జరుగుతోందని, విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో సమూల మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. 2008 డీఎస్సీ ద్వారా ఎంపికైన 6304 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వడం జరిగిందని, 10 వేల మందికి పైగా లాగ్వేంజ్ పండిట్లకు, 263 మంది పీఈటీలకు, 11,394 మంది టీచర్లకు పదోన్నతులు కల్పించామన్నారు. రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచామన్నారు. పీఈటీలు, కంప్యూటర్ టీచర్ల వేతనాలను రూ. 15 వేల నుంచి రూ. 44 వేలకు పెంచామన్నారు. ఎనిమిది వేల మంది టీచర్లను సబ్జెక్టు టీచర్లుగా గుర్తించి పదోన్నతులు ఇచ్చామని, 2227 మందికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించామన్నారు. ఈ విషయాలన్నీ పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వివరించి వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసేలా చూడాలన్నారు.

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ నాయకత్వంలో మనం అనేక ఎన్నికలను ఎదుర్కొన్నామని, ఆయన మరణానంతరం వైఎస్సార్ సీపీ స్థాపించాక కూడా ఎన్నికల్లో అనేక సవాళ్లను ఎదుర్కొన్నామన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా అలాగే చూడాలని, సాదాసీదా ఎన్నికలుగా భావించవద్దని హెచ్చరించారు.
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, , ఎంవీ రామచంద్రారెడ్డిలను గెలిపించేందుకు జేసీఎస్ కన్వీనర్లు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు.
- నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లను గుర్తించడం సులువని, పట్టణ ప్రాంతాల్లో కొంచెం కసరత్తు చేయాల్సి ఉంటుందన్నారు. 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఇవి సెమీ ఫైనల్ లాంటివని గుర్తు చేశారు.
- ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో 98.5 శాతం ఎన్నికల హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.
- జేసీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ చల్లా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను డోర్ డెలివరీ చేయడం జరిగిందన్నారు. ఫలితంగా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, అందులో పట్టభద్రుల కుటుంబాలు కూడా లబ్ధిపొంది ఉంటాయన్నారు.
- కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంవీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు పెన్నా నదికి నీరు విడుదల

మైలవరం (జమ్మలమడుగు రూరల్): మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కొరకు గురువారం ఉదయం పెన్నానదికి మైలవరం జలాశయం అధికారులు నీరు విడుదల చేయనున్నారు. మైలవరం జలాశయంలో ప్రస్తుతం 5 టీఎంసీల నీరుంది.

## క్లుప్తంగా

### స్పెషల్ డ్రైవ్‌లో 214 కేసులు

**కడప అర్బన్ :** జిల్లాలో పోలీసులు చేపట్టిన వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై బుధవారం మొత్తం 214 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలను నడిపిన వారిపై 158, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, తదితర వాహనాల డ్రైవర్లపై 56 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు.

### బ్ర.మఠంలో హుండీ ఆదాయం లెక్కింపు

**బ్రహ్మంగారిమఠం :** ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో బుధవారం హుండీ ఆదాయానిన లెక్కించారు. రూ 15,05470 నగదు, బంగారం 7.5 గ్రాములు, వెండి 0.38 గ్రామలు వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా బ్రహ్మంగారు,గోవిందమాంబల కల్యాణోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. ఈసందర్భంగా భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మఠం పిట్‌పర్సన్ ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీ, పూర్వపు మఠాధిపతి ప్రథమ కుమారుడు వెంకటాద్రి స్వామి, మఠం సిబ్బంది పాల్గొన్నారు.

### చెక్‌బౌన్స్ కేసులో ఆరునెలల జైలు

**కడప అర్బన్ :** చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఆరునెలల జైలు శిక్ష విధిస్తూ కడప ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హేమస్రవంతి జానకిరామ్ బుధవారం తీర్పు ఇచ్చారు. జిల్లాలోని ఖాజీపేటలో నివాసం ఉంటున్న బండి ఆనందరావు 2016లో కడప శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రూ. 2,00,000 (రెండు లక్షలు) రుణం తీసుకున్నాడు. కొంత డబ్బులను చెల్లించాడు. ఇదిలా ఉండగా బండి ఆనందరావు రూ. 3,80,000 (మూడు లక్షల ఎనభై వేలు)కు 2018లో బ్యాంక్ చెక్కును ఇచ్చాడు. కంపెనీ నిర్వాహకులు చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. వెంటనే సంస్థవారు కోర్టులో కేసు దాఖలు చేశారు. బుధవారం వాయిదాకు రాగా మెజిస్ట్రేట్ ఈ కేసుకు సంబంధించి పూర్వాపరాలు పరిశీలించగా చెక్‌బౌన్స్ అయినట్లు తేలింది. ఈ మేరకు బండి ఆనందరావుకు 6 నెలల పాటు జైలు శిక్ష , రూ. 3,80,000 కట్టాలని ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.

### 'దిశ' పోలీస్‌స్టేషన్ వద్ద మహిళ హల్‌చల్!

**కడప అర్బన్ :** కడప నగరంలోని 'దిశ' పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, వారికి తోడుగా వచ్చిన శైలజ అనే మహిళ దుర్భాషలాడుతూ, సెంట్రీ విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించింది. ఆమె విధులకు సైతం ఆటంకం కలిగిస్తూ హల్‌చల్ చేసింది. దీంతో మహిళా కానిస్టేబుల్ షామిలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా తనపై దిశ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది అనవసరంగా దాడి చేశారని శైలజ ఆరోపించింది.

# ఆర్డీఓ హామీతో సమ్మె విరమణ

**మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ప్రారంభించిన కమీషన్ ఏజెంట్లు**


టర్మరిక్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి

**కడప అగ్రికల్చర్ :** కడప వ్యవసాయ మార్కెట్‌లో శీతల గిడ్డంగి నిర్మాణ పనుల కారణంగా చోటు చేసుకున్న వివాదం పరిష్కారమైంది. దీంతో టర్మరిక్ అసోసియేషన్ నాయకులు(కమీషన్ ఏజెంట్లు) సమ్మె విరమించి కొనుగోళ్ల ప్రారంభించారు. ఈ విషయంపై టర్మిరిక్ ఆసోసియేషన్ నాయకులు బుధవారం ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి ..మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులుతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసోసియేషన్ నాయకుల తమ వద్ద ఉన్న పత్రాలను ఆయనకు చూపించారు. పండ్లవ్యాపారి తప్పుడు పత్రాలను కోర్టుకు చూపి స్టే తెచ్చుకున్నారని వివరించారు. ఈ విషయాన్ని నేను పరిష్కరిస్తానని, పండ్లవ్యాపారికి ఈ నెల చివరి వరకే వ్యాపారానికి సంబంధించి లైసెన్స్ గడువు ఉందని తెలిపారు. సమస్య తెగకపోతే లైసెన్సును రద్దు చేసేందుకు కూడా వెనకాడబోమన్నారు. మార్కెటింగ్‌శాఖ తరఫును కోర్టులో కౌంటర్ దాఖలు చేస్తున్నామని, అపని మీదే సెక్రటరీ విజయవాడలో ఉన్నారని వారికి తెలిపారు.మీరు నా మాట విని సమ్మె విరమించి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పసుపు, వేరుశనగ కాయల కొనుగోలు చేయాలని టర్మరిక్ అసోసియేషన్ నాయకులను ఆర్డీఓ కోరారు. ఆర్‌డీవో మాట ప్రకారం సమ్మెను విరమించి బుధవారం నుంచి కొనుగోళ్లను ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి, మార్కెటింగ్‌శాఖ జేడీ రామాంజనేయులుకు టర్మరిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కార్యదర్శి రాఘవులు, కోశాధికారి గుర్రంకొండ మహేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, అసిస్టెంట్ డైరెక్టర్(ఇన్‌చార్జి)అజీద్‌వల్లి పాల్గొన్నారు.

**సమస్య నేపథ్యమిది..**

మార్కెట్‌యార్డులో వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం మినహా వేరే వ్యాపారాలు చేయకూడదని నిబంధనలు ఉన్నా పండ్ల వ్యాపారి ఫిరోజ్ ఆలీఖాన్ ఇక్కడ పండ్ల నిల్వ కోసం శీతల గిడ్డంగి నిర్మాణ చేపట్టారు. దీనిపై కమీషన్ ఏజెంట్లు, మార్కెట్‌యార్డు సిబ్బంది అభ్యంతరం తెలిపారు. పండ్ల వ్యాపారి హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని పనులు మొదలు పెట్టారు. దీంతో కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌యార్డు డైరెక్టర్, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చర్చించి అందరూ కలిసి పండ్లవ్యాపారి వద్దకు వెళ్లి పనులను ఆపాలని కోరారు. దానికి అతను నాకు హైకోర్టు స్టే ఇచ్చిందని పనులను ఆపనని తెగేసి చెప్పడంతో కమీషన్ ఏజెంట్లు పసుపు, వేరుశనగ కాయల కొనుగోలును ఆపి సమ్మెలోకి వెళ్లారు. దీంతో రెండు రోజులపాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను పరిశీలించాని ఆర్డీఓను ఆదేశించారు. దీంతో ఆయన అక్కడికి వెళ్లి మార్కెటింగ్ అధికారులుతో సమావేశమయ్యారు. సమస్యపై చర్చించారు. కొనుగోళ్లను ప్రారంభించాలని టర్మరిక్ అసోసియేషన్ నాయకులను కోరగా సమస్య తెగే వరకు కొనుగోళ్ల చేపట్టమని చెప్పారు.

### వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్‌పై
# టీడీపీ నాయకుడు దాడి


గాయపడిన మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులు

**ప్రొద్దుటూరు క్రైం :** పట్టణంలోని 33వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అగ్గారపు శ్రీనివాసులుపై టీడీపీ నాయకుడు కుతుబుద్దీన్ తన అనుచరులతో కలిసి దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు.. ఆర్ట్సుకాలేజీ రోడ్డులోని 33వ వార్డులో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కుతుబుద్దీన్ భార్య శివజ్యోతి మున్సిపల్ కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు. అగ్గారపు శ్రీనివాసులు వార్డు ఇన్‌చార్జిగా ఉంటూ ప్రభుత్వం తరపున అభివృద్ధి పనులు చేస్తున్నారు. తన భార్య వార్డు కౌన్సిలర్ అయినా అగ్గారపు శ్రీనివాసులు అభివృద్ధి పనులు చేయడాన్ని కుతుబుద్దీన్ జీర్ణించుకోలేకపోయాడు. దీంతో శ్రీనివాసులుపై అతను రాజకీయ కక్ష, అసూయ పెంచుకొని బెదిరించసాగాడు. వార్డులో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కుతుబుద్దీన్ తన అనుచరులతో కలిసి ఆర్ట్సుకాలేజీ రోడ్డులోని అగ్గారపు శ్రీనివాసులు ఇంటిపై దాడి చేశాడు. శ్రీనుతో పాటు మహిళలపై కట్టెలతో దాడికి దిగారు. ఈ సంఘటనపై కుతుబుద్దీన్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

**నలుగురు టీడీపీ నాయకులు అరెస్టు**

మాజీ కౌన్సిలర్ అగ్గారపు శ్రీనివాసులుపై దాడి చేసిన కేసులో కుతుబుద్దీన్, లక్ష్మీనారాయణ, మహబూబ్ బాషా, బషీరుద్దీన్‌లను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. వీరిపై 450, 354, 324, 506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం నలుగురిని రిమాండుకు తరలించామన్నారు. అలాగే కుతుబుద్దీన్ ఫిర్యాదుపై అగ్గారపు శ్రీనివాసులుతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

# బైక్ అదుపు తప్పి ఇద్దరు దుర్మరణం



అలోక్, అంకయ్య మృతదేహాలు

**మైదుకూరు :** మైదుకూరు – ప్రొద్దుటూరు రహదారిపై బుధవారం రాత్రి బైక్ అదుపుతప్పి ఖాజీపేట మండలం మల్లాయపల్లె కు చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు.వివరాలిలా ఉన్నాయి.మల్లాయపల్లె ఎస్సీ కాలనీకి చెందిన అలోక్ (32 ),అంకయ్య (25) అనే తోడల్లుళ్లు తమ బావమరిది మనోజ్ ను బెంగళూరు వెళ్లేందుకు మైదుకూరు రాయల్ సెంటర్లో బస్సు ఎక్కించారు.బస్సు బయలు దేరాక ఇద్దరూ బైకుపై బస్సు వెనకాల వేగంగా వెళ్లారు.ప్రొద్దుటూరు రోడ్డులోని హైవే బ్రిడ్జి వద్ద బైకు అదుపు తప్పి ఇద్దరూ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డారు. ఇదంతా బస్సులోనుంచి గమనిస్తున్న మనోజ్ బస్సును ఆపించి దిగాడు.అక్కడున్న దాబా వద్ద ఉన్నవారు 108 అంబులెన్స్కు సమాచారం ఇచ్చారు.అంబులెన్స్ లో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా ఇద్దరు మృతి చెందారు.

# వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి

**డిప్యూటీ సీఎం అంజద్‌బాషా**


గజ్జల మెటర్నటీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

**కడప రూరల్ :** స్థానిక ఎన్జీఓ కాలనీలోగల నూతనంగా గజ్జల మెటర్నటీ ఆస్పత్రిని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెటర్నటీ విభాగానికి సంబంధించి డాక్టర్ ఎ.శకుంతల అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఆస్పత్రిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ ఆస్పత్రిలో లభించే మెరుగైన వైద్య సేవలను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాలో కడప నగరం కేంద్రంగా అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఆస్పత్రి ఏర్పాటు కావడం ప్రశంసనీయమన్నారు. నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో లభించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఎ.శకుంతల మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో మెటర్నటీ విభాగానికి సంబంధించి గర్భిణుల వైద్య సేవలు, గర్భసంచి, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. నొప్పులు లేకుండా సుఖ ప్రసవం, కాన్పులు, ఆపరేషన్లు నిర్వహించడం తమ ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో జి.మధుసూదన్‌రెడ్డి, సాయి మహేష్, సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డితో పాటు కడప నగర ప్రముఖులు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని ఆజాద్ నగర్ గ్రామానికి చెందిన వేమారెడ్డి (17)అనే యువకుడు ఇంటిలో బుధవారం ఉరి వేసుకుని మృతి చెందినట్లు సీకె దిన్నె ఎస్‌ఐ అరుణ్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వేమారెడ్డి అన్న, తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడన్నారు. మృతికి సంబంధించిన కారణాలను తెలియ రాలేదన్నారు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి

**పెండ్లిమర్రి :** మండలంలోని మమ్ముసిద్దుపల్లె గ్రామానికి చెందిన సి.రాజగోపాల్‌రెడ్డి(62) అనే రైతు బుధవారం విద్యుదాఘాతంతోమృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు రాజగోపాల్ రెడ్డి మొయిళ్లకాల్వ గ్రామ సమీపంలో ఉన్న తన పొలంలో పొలం పని చేసుకుంటూ ఉండగా పక్కన ఉన్న వ్యవసాయ బోరుకు సంబంధించిన విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టరం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తి చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# లక్ష్యసాధనకు కష్టపడాలి


జ్యోతి వెలిగిస్తున్న ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, ప్రొఫెసర్లు

**ప్రొద్దుటూరు :** విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడాలని తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక పశువైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రణాళిక ప్రకారం చదివాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన యూనివర్సిటీ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జేవీ రమణ మాట్లాడుతూ పశువైద్య విద్యార్థులకు ఉన్న ఉద్యోగావకాశాల గురించి వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు కళాశాల విద్యార్థులు సాధించిన ప్రగతి వివరాలను వెల్లడించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ఆఫీస్ ఆఫ్ స్టూడెంట్ యాక్టివిటీస్ డాక్టర్ ఎస్.వినోద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లింగ వివక్ష చూపితే క్రిమినల్ కేసు

**జేసీ సాయికాంత్‌వర్మ**


మాట్లాడుతున్న జేసీ సాయికాంత్‌వర్మ

**కడప సిటీ :** సమాజంలో బాలబాలికల నిష్పత్తిలో అంతరాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, లింగ వివక్షను చూపే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జేసీ సాయికాంత్‌వర్మ అధికారులను సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, మాతా శిశు మరణాల నిర్మూలనపై జేసీ సాయికాంత్‌వర్మ సంబంధిత అధికారులతో గర్భస్థ శిశు నిర్ధారణ, పరీక్షల నిర్మూలన (పీసీ పీఎన్‌డీటీ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బాలల లింగ నిష్పత్తిని గమనిస్తే బాలికల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. జిల్లాలోఎక్కడైనా లింగ వివక్ష జరుగుతోందని బాధితురాలుగానీ, కుటుంబ సభ్యులుగానీ తగు ఆధారాలతో తమ దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లింగ వివక్షతను వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చి ఫిర్యాదు చేసే వారికి పీసీ పీఎన్‌డీటీ అండగా ఉంటుందన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్‌సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. మొదటిసారి రూ. 10 వేలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష, రెండోసారి రూ. 50 వేలు జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష, మూడోసారి చివరిగా రూ. లక్ష జరిమానా, ఐదేళ్ల జైలు శిక్షతోపాటు వైద్య వృత్తి గుర్తింపు శాశ్వతంగా రద్దు చేయనున్నట్లు చెప్పారు. అలాగే గర్భస్రావాలు జరగకుండా ఆపాలన్నారు సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంహెచ్‌ఓలు ఖాదర్, ఉమామహేశ్వరరావు, రిమ్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీడీహెచ్‌ఎస్ హిమదేవి, ఐసీడీఎస్‌పీడీ ఎంఎస్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ ఫ్యాక్టరీలో కెమికల్ డబ్బా పేలి ప్రమాదం

**ఆరుగురికి గాయాలు**



గాయపడిన గౌస్‌బీ, రాహుల్‌కుమార్, లక్ష్మణ్

**ప్రొద్దుటూరు క్రైం :** పాత ప్లాస్టిక్ వస్తువుల ఫ్యాక్టరీలో కెమికల్ డబ్బా పేలి ఏడుగురు గాయ పడ్డారు. డబ్బా మూత రాకపోవడంతో రాడ్డుతో గట్టిగా కొట్టగా పెద్ద శబ్దంతో అది పేలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక కొత్తపల్లె బైపాస్‌రోడ్డు సమీపంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో మహమ్మద్ ఆలీ స్టార్ ప్లాస్టిక్ పేరుతో ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. పట్టణంతో పాటు గ్రామాల్లో సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లు, పగిలిన ప్లాస్టిక్ బిందెలను ఇక్కడి ఫ్యాక్టరీకి తరలిస్తారు. బాటిళ్లు, బిందెలను వేరు చేసేందుకు పలువురు కూలీలు అందులో పని చేస్తున్నారు. బుధవారం కూలీలు పని చేస్తున్న సమయంలో వారికి ఒక పాత ప్లాస్టిక్ డబ్బా కనిపించింది. డబ్బాను తెరిచేందుకు రాడ్డుతో కొట్టగా అది ఒక్కసారిగా పేలింది. అందులో కాలం చెల్లిన కెమికల్ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో చాడేశ్వరి, మాబుచాంద్, అచ్చుకట్ల గౌస్‌బీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌కుమార్, లక్ష్మణ్, రాజేష్‌లు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో అచ్చుకట్ల గౌస్‌బీకి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు. తీవ్ర గాయాలైన వారిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ సంజీవరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఆలయంలో చోరీ

**మైదుకూరు :** మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె వద్ద ఉన్న తిరుమలనాథ స్వామి ఆలయంలో చోరీ జరిగింది. హుండీలో భక్తులు సమర్పించిన రూ.2లక్షల నగదు, బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సోమవారం రాత్రి జరిగినట్లు భావిస్తున్న ఈ సంఘటనలో దొంగలు ఆలయం తూర్పు వైపున ఉన్న ఇనుప వాకిలి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. గర్భగుడి బయట ఉన్న రెండు సీసీ కెమెరాలను దిశను దుండగలు మళ్లించారు. అయితే గర్భగుడి లోపల ఉన్న సీసీ కెమెరాలో దొంగలు హుండీని బయటకు ఎత్తుకెళ్లే దృశ్యాలు రికార్డు అయ్యాయి. హుండీని సమీపంలో ఉన్న చెరువు వద్ద ఆంజనేయస్వామి గుడి వద్దకు ఎత్తుకెళ్లి గునపంతో పగులగొట్టారు. అందులోని నగదును, బంగారు ఆభరణాలను తీసుకెళ్లారు. హుండీని చెరువులోని నీటి గుంటలో పడేసి వెళ్లారు. సీసీ కెమెరాల పుటేజిలో దొంగతనానికి ఇద్దరు వ్యక్తులు పాల్పడినట్లు స్పష్టమవుతోంది. తమ కోర్కెలు నెరవేరడంతో 20 రోజుల కిందట స్వామి భక్తులైన దంపతులు నిలువు దోపిడీ పేరుతో తమ ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను హుండీలో వేసినట్లు తెలుస్తోంది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

### ఘనంగా సిరిమాను ఉత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**లక్కిరెడ్డిపల్లె :** ఫిబ్రవరి 21,22 తేదీల్లో జరిగిన గంగమ్మ జాతర రోజున ఏర్పాటు చేసిన సిరిమానుకు బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కిందికి దించారు. దీనిని ఎనిమిది రోజుల పాటు ఉంచారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు.బుధవారం వంద మంది భక్తులతో పూజారులు ఆదిమూలం చంద్ర,రెడ్డిశేఖర్‌లు ,ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్ర రాజు ఆధ్వర్యంలో భక్తులు సిరిమానును కిందకు దించి ఆలయం లోపల యథాస్థానంలో ఉంచారు.

### పంట పొలాల్లో కొండచిలువ ప్రత్యక్షం


గడ్డికింద ఉన్న కొండచిలువ

**అట్లూరు :** బద్వేలు మండలం రాజుపాలెం గ్రామ సమీపంలోని పొలాలలో బుధవారం కొడచిలువ కనిపించింది. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల కథనం మేరకు మామిడి తోటలలో సుమారు పది అడుగులకు పైబడిన పొడవు గల కొండచిలువ తిరుగతూ కనిపించింది. గమనించిన రైతులు సిద్దవటం రేంజ్ అధికారి ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు వెంటనే సెక్షన్ అధికారి సురేష్, బీట్ ఆఫీషర్ విశ్వనాధరెడ్డి, ప్రొటక్షన్ వాచర్ రమణా కొండచిలువ ఉన్న ప్రదేశానికి వెళ్లి దానికి పట్టుకుని ఓ డ్రమ్ములో బంధించారు. అనంతరం లంకమల్లేశ్వర అభయారణ్యంలోని కొడూరు బీట్ పరిధిలో విడిచిపెట్టారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

# వైవీయూ ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్‌గా డా. సుబ్రమణ్యం


ఐక్యూఏసీ సెల్ సభ్యులతో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య

**వైవీయూ :** యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్గత నాణ్యత హామీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్) విభాగం సంచాలకులుగా డాక్టర్ లోకా సుబ్రమణ్యంశర్మ (కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్)ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య నియామక పత్రాన్ని అందజేశారు. వీసీ ఆచార్య జింకా రంగజనార్ధన ఆదేశాల మేరకు నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఉప సంచాలకులుగా డా. సుభోష్‌చంద్ర (మైక్రోబయాలజీ), సభ్యులుగా డా. టి. లక్ష్మీప్రసాద్ (ఎర్త్‌సైన్స్), డా. కె. వెంకటేశ్వర్లు (కెమిస్ట్రీ), డా. కె. రియాజున్నీసా (బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్), డా. ఎల్. దాక్షాయని (జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్), డా. టి. శ్యాంస్వరూప్ (జర్నలిజం)లను నియమించారు. వీరందరికీ రిజిస్ట్రార్ నియామక పత్రాన్ని అందజేసి, క్రియాశీలకంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# ప్రాణం తీసిన ఈత సరదా

**నీట మునిగి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి**



నీటి నుంచి మృతదేహాన్ని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్) రఘునాథ మృతదేహం

**పీలేరురూరల్ :** సరదాగా ఈతకెళ్లి పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా పీలేరు మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సత్యసాయి జిల్లా బుగ్గపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన టి. నల్లప్ప కుమారుడు టి. రఘునాథ (16) స్థానిక ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ట్రిపుల్–ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని వైవీఆర్ హాస్టల్‌లో ఉంటూ కళాశాలకు వెళ్లి వచ్చేవారు. బుధవారం స్నేహితులు ఐదుగురితో కలసి గుర్రంవారికుంటకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. నీటిలో దిగిన రఘునాథ బయటికి రాలేదు. దీంతో స్నేహితులు హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.